# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త



## శ్రీచెంగాళమ్మకు దుర్గాదేవి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపంలో మహాచండీయాగాన్ని గోపూజ అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించి మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగించారు. యాగానికి దబ్బల శ్రీమంత్‌రెడ్డి, హారిక దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు. శ్రీదుర్గాదేవి అలంకారానికి నెల్లూరుకు చెందిన గంగిశెట్టి సాయికుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మణ్ణికి సారెలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా సూళ్లూరు, నాగరాజపురం, వాటంబేడు రోడ్డు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మణ్ణికి సారెలు సమర్పించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరుకు చెందిన కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు

## మహిళలచే 3033 పాల కలశాలు ఊరేగింపు

వి.కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త



వి.కోట దుర్గామాత ఆలయంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని గురువారం మహిళలు 3033 పాల కలశాలతో పట్టణంలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ప్రధాన రహదారి గుండా మహిళలు దుర్గామాత ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, తెదేపా నేతలు, సర్పంచ్ పిఎస్ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రప్రభపై దర్బార్‌కృష్ణుడు









తిరుమల, అక్టోబర్ 10 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఏడవవరోజు గురువారంరాత్రి చంద్రప్రభవాహనంపై దర్బార్ కృష్ణుడుగా సర్వజగద్రక్షకుడు భక్తులనుకరుణించాడు. శ్రీవారికి సూర్య చంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన శ్రీనివాసుడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతోకూడిన వాహనంపై విహరించాడు. చంద్రుడు భగవంతుని మారురూపమే. చల్లనిదేవరప్రభతో శ్రీవేంకటేశ్వరుడు భక్తులకు దర్శన మిచ్చాడు. కర్పూరహారతులందుకుని రాత్రి 7గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. ఈ వాహన సేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఓలు గౌతమి,వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సినీనటుడు బాలకృష్ణ సతీమణి వసుంధర, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు,సివిఎస్ఓ శ్రీధర్,తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ,భక్తులు పాల్గొన్నారు.

## సూర్యప్రభపై సప్తగిరీశుడు



తిరుమల, అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: స్వర్ణమయంతో కూడిన సప్తఅశ్వాలు వాహనాన్ని లాగుతున్న సూర్యప్రభను అధిరోహించిన యెగముద్రలోని బద్రీనారాయణుడు గురువారం ఉదయం తిరుమాఢవీధుల్లో విహరించాడు. సూర్యుడు స్వయంప్రకాశితుల్లో ఒకరు. అలాంటి సూర్యప్రభను వాహనంగా చేసుకున్న శ్రీనివాసుడు సప్తఅశ్వాలు లాగుతున్నట్లుగా రూపొందించిన సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. మాఢవీధుల్లో ప్రదక్షణగా వచ్చిన సూర్యనారాయణుడిని దర్శించుకున్న భక్తులకు ఇతోధిక బోగభాగ్యాలు, సత్సంతానసంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటి డి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఆలయ ప్రధానఅర్చకులు వేణుగోపాలదీక్షితులు,సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర,తిరుమల డిఎస్పీ విజయశేఖర్ పాల్గొన్నారు.

## దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 10 ప్రభాతవార్త శరవన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం బోయకొండ గంగమ్మ దుర్గాదేవిగా అవతారమెత్తారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉభయదారులు చండీ, గణపతి హోమాలు నిర్వహించి పూర్ణాహుతిగావించారు. అన్నమయ్య జిల్లా డిపిఓ మదనపల్లి ధనలక్ష్మి, శివప్రసాద్, ముళబాగలు విద్యావతి, హనుమప్ప, పలమనేరు రత్నమ్మ, భాస్కరయ్య, పుంగనూరు ఆనంద, పార్వతి, కొలింపల్లి యశోదమ్మ, ప్రభాకర్, చెన్నై అనుప్రియ, శివముద్ర, మాదంవారిపల్లి రత్నమ్మ, వెంకటనారాయణ, బెంగళూరు ప్రియాంక, సుందరమూర్తి, పుంగనూరు శ్రీనివాసులు, వరలక్ష్మి, మదనపల్లి సాయిలీల, బాలాజీనాయక్, సుమల మణికంఠ, అంగళ్ళు స్వప్న, రవికుమార్‌రెడ్డి, బోయకొండ జీఆర్ఎస్ రమణ, మమతలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వారికి అమ్మవారి పతిత్ర తీర్థ ప్రసాదాలందించి గౌరవించారు.

### గంగమ్మకు చంద్రహారం బహూకరణ



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాత బంగారం చంద్రహారాన్ని బహూకరించారు. ఆలయంలో ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంకు దాత రామసముద్రం మండలం కమతంపల్లికి చెందిన విజయ్‌కుమార్, చైతన్యలు రూ. 1.30లక్షల విలువగల బంగారం చంద్రహారాన్నందించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుర్గాదేవి అలంకారంలో వున్న గంగమ్మ దర్శభాగ్యం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగిరెడ్డి, అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## 14నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన



కుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 14-17 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈమేరకు పర్యటన ఖరారైంది. విశ్వసనీయసమాచారం మేరకు పర్యటన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14న బెంగళూరు నుంచి వి.కోటకు మధ్యాహ్నం 12.30గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.30గంటలకు శాంతిపురం చేరుకుని అక్కడ డ్వాక్రా మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం మొరసనపల్లిలోతమ సొంత ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తారు. 15న ఉదయం 10గంటలకు ప్రజలనుంచి వినతులు సీ వ్కరిం చిన అనంతరం నలగాంపల్లికి చేరుకుని అక్కడ మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం 11.30గంటలకు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం చేపడతారు. అనంతరం మధ్యాహ్నం 2.30గంటలకు రామకుప్పం మండలం మొద్దులవంక, గాంధీ నగరం గ్రామాల్లో పర్యటించి మహిళలతో మాట్లాడతారు. అనంతరం కుప్పంకు చేరుకుంటారు. 16వతేది ఉదయం 10గంటలకు ప్రజలనుంచి వినతులు సీ వ్కరించిన అనంతరం కుప్పం బిసిఎన్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 12గంటల దాకా ఎపిఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం సన్మాన సభలో పాల్గొంటారు. అనంతరం వానగుట్టపల్లి, గుండ్లమడుగు గ్రామాల్లో పర్యటిస్తా_రు.

## ప్రజా పరిష్కార వేదికలో అర్జీల వెల్లువ

### అర్జీలను స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ..న అర్జీలు సంబంధిత శాఖలకు కేటాయింపు



నగరి, అక్టోబరు 10 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కొరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జిల్లాకలెక్టర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదులపరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. గురువారం నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు సంబంధించి నిర్వహించిన ఈ ప్రజా ఫిర్యాదులపరిష్కార వేదికకు 200లకుపైగా వినతులు వచ్చాయి. వీటిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌సమక్షంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్,జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించి వాటిని పరిష్కరించాలంటూ సంబంధిత శాఖల వారికి కేటాయించి ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన వినతి పత్రాలో ప్రధానంగా ఏకాంబరకుప్పం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని, ఉదయం 7.10 కి వచ్చేచెన్నై, తిరుపతి ట్రైన్‌ని పునరుద్ధరించాలని, గ్యాస్ పంపిణీలో సిలిండర్ ధర రూ.880 తీసుకుంటున్నా డోర్ డెలివరీ చేయడం లేదని, ఓటీపీ సిస్టమ్‌తో గ్యాస్ బుకింగ్‌ను మార్చాలని, నగరి-బెంగళూరు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని, పట్టణ పరిధిలో ప్రమాధకరంగా ఉన్న క్వారీలను ఆపి వేయాలని, పలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటుచేయాలన్న అర్జీలు రాగా, పలువురు పెన్షన్లు, ఇంటి పట్టాలు తదితర సమస్యలపై అర్జీలు ఉంచుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీపీ భార్గవి, జిల్లా అధికారులు జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఏడీ సర్వే గౌస్‌బాషా, ఇన్‌చార్జి డీఎం అండ్‌హెచ్‌వో డా. వెంకటప్రసాద్, డీఎల్‌డీవో రవి కుమార్, డీసీహెచ్ఎస్ డా. ప్రభావతి, నగరి తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చఆర్జి ఎంపీడీవో సతీష్, వివిధ సంబంధిత శాఖల మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ప్రజా పరిష్కారం వేదిక ప్రారంభానికి ముందు స్థానిక ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ని ఎమ్మెల్యే, కలెక్టర్‌లు ప్రారంభించారు.

## దుర్గాదేవి అలంకారంలో ముత్యాలమ్మ





చిల్లకూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త మండల పరిధిలోని తూర్పు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా 8వ రోజు గురువారం ఉదయం మూలమూర్తులకు అభిషేకాలు గణపతి పూజ చండీ పారాయణ చండీ హోమం నిర్వహించారు. ఉదయం మూలమూర్తిని బంగారు చీర అలంకారించారు. సాయంత్రం సహస్రనామార్చన సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారు పులివాహనంలో అర్ధరథంపై కొలువుదిరి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మాడా వీధుల్లో ఘనంగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వేమారెడ్డి మురళీమోహన్ రెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలకు అదే విధంగా కలవకొండ గ్రామంలో కొండపై వెలసి వున్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో 8వ రోజు ఆలయంలో మూలమూర్తులకి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం విజయలక్ష్మి అమ్మవారి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎల్లంటి ప్రభాకర్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సిద్ధరెడ్డి ఇంద్రసేనా రెడ్డి, ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్ కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, దువ్వూరు సాయి కృష్ణారెడ్డి, చేవూరు శ్రీనివాసులు, బాలు బాలాజీ, ఉప్పల ప్రభాకర్ ఎల్లసిరి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్





తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 10, ప్రభాతవార్త నూతన ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులో పారదర్శకంగా ఇసుక అందేలా, ప్రభుత్వానికి ఇసుక ద్వారా ఎలాంటి ఆదాయం ఆశించకుండా పలు చర్యలు చేపట్టిందని, తొందర్లో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుండి సుమారు 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ యార్డు పాయింట్ల నుండి పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్‌లక్ష జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరితో పాటుగా జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వ ఏర్పాటైన తర్వాత ప్రజలకు అందుబాటులోకి పారదర్శకంగా ఇసుక అందేలా ప్రభుత్వానికి ఇసుక ద్వారా ఎలాంటి ఆదాయం ఆశించకుండా పలు చర్యలు చేపట్టిందని, ఈ ఉచిత ఇసుక విధానంలో గత మాసాలలో పలు డిపోలు ద్వారా ఇసుక అందుబాటులో ఉంచగా ప్రజలు వినియోగించుకున్నారని తెలుపుతూ జిల్లాలో గుర్తించిన మూడు డిస్టిలేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం నందు, మరొకటి గూడలి కోట మండలం నందు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు వచ్చాయని అధికారులు తెలుపగా, స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతం నందు తొందర్లో పాలచూర్ అనికట్ అప్ స్ట్రీమ్ పుల్లూరు గ్రామం, పెళ్లకూరు మండలం నందు 1.920 హెక్టార్‌లలో 28782 క్యూబిక్ మీటర్లు, 43173 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంటుందని, పాలచూరుఅనికట్ డౌన్ స్ట్రీమ్, దిగువ కలువకూరు గ్రామం పెళ్లకూరుమండలం నందు 1.821 హెక్టార్‌లలో 27309 క్యూబిక్ మీటర్లు, 40963 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంటుందని, స్వర్ణముఖి బ్యారేజీ సమీపంలో గూడలి గ్రామం, కోట మండలం నందు 2.300 హెక్టార్‌ల విస్తీర్ణంలో 35700 క్యూబిక్ మీటర్లు, 53550 మెట్రిక్‌టన్నులు ఇసుకఅందుబాటులోకి రానున్నదని తెలిపారు.

## చనిపోయిన వ్యక్తిని గోతిలో పడేసి వెళ్లిన వ్యక్తి

సదుం,అక్టోబరు 10 ప్రభాతవార్త నమ్మి వెంట వెళ్లిన వ్యక్తి ప్రమాదంలో చనిపోతే ఆనెపం తనపైకి వస్తుందని భయంతో ఆవ్యక్తిని తీసుకువచ్చి నీళ్ల గొయ్యిలో పడేసి పారిపోయిన సంఘటన జరిగింది. ఇంటి నుండి వెళ్లిన కుటుంబ సభ్యుడు ఎన్ని రోజులకు తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా అతని శవం బయట పడిన సంఘటన సదుం వద్ద వెలుగు చూసింది. అన్నమయ్య జిల్లా కలికిరి మర్రికుంటపల్లెకు చెందిన హరినాథ్(47) ఇతని స్నేహితుడితో కలిసి కొబ్బరి కాయల వ్యాపారం చేస్తున్నారు. ఈక్రమంలో హరినాథ్ ఈనెల 2వ తేదీ నుంచి కనపడకుండా పోయాడు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతికి, బందువుల ఇళ్ల వద్ద వెతికి చివరకు కలికిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ పోలీసులు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఈ క్రమంలో అనుమానంతో హరినాథ్ స్నేహితుడిని విచారించగా కొబ్బరి కాయల చెట్టు పై నుంచి కింద పడి చనిపోయాడని భయపడి శవాన్ని సదుం వద్ద పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టు సమీపంలోని నీటిగుంటలో వేసినట్లు చెప్పి గురువారం ఇక్కడకు వచ్చి చూపించాడు. దీనితో కలికిరి పోలీసులు శవాన్ని వెలుపలికి తీసి కలికిరికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. దీనిపై పూర్తి వివరాలు విచారణలోతెలియాల్సి ఉంది.

## డిఇఓపై ఉపాధ్యాయ సంఘాల తిరుగుబాటు

### - గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించారనే అక్కసుతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్న గంటామోహన్‌పై సస్పెన్షన్‌ను బేషరతుగా ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజుపై తిరుగుబాటు చేశాయి. చిత్తూరు ఎన్జీఓ హోమ్ గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుండి ఉపాధ్యాయ సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ గంటామోహన్ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పక్షాల సీనియర్ నాయకుడిగా పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఆయన పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కక్షపూరిత వైఖరీని విడనాడాలని స్పష్టం చేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘ నాయకులు నోటీసులు అందించడానికి డిఇఓ కార్యాలయంకు వెళ్ళగా ఈ మేరకు డిఇఓ దేవరాజు ఉపాధ్యాయ సంఘ నేతలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు మునాఫ్, జివి రమణ, చెంగ్రాలయమందడి, మదన్‌మోహన్‌రెడ్డి, గోపినాథ్, మునీర్ అహ్మద్, మణిగండన్, మణి, మోహన్ యాదవ్, కిరణ్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మందులు కాల్చేశారు... -సిరఫ్‌లు గంగ కాలువలోకి...

తొట్టంబేడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త



ఇలనూరు గ్రామం వద్ద తెలుగుగంగ కాలువ సమీపంలో కాల్చివేసిన మాత్రలు దృశ్యం

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పిలను నియమించింది. వీరిని ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా పేరు మార్చారు. మండలంలో రెండు పిహెచ్‌సి కేంద్రాలు ఉన్నాయి. ఒకటి తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాగా, మరొకటి కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఇక సచివాలయాలు మండలంలో 16 ఉండగా తొట్టంబేడు ఆరోగ్యకేంద్ర పరిధిలో 10, కాసరం ఆరోగ్య కేంద్రం పరిధిలో 6 సచివాలయాలు వస్తాయి. సంబందిత పంచాయతీల్లోని సచివాలయాల్లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పిలు సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో సర్వేచేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన అవసరం ఉంది. అయితే ఎంఎల్‌హెచ్‌పిలు ఎప్పుడెప్పుడు వస్తారో గ్రామాల్లో ఎప్పుడు సర్వేచేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటారో కూడా తెలియదు. ప్రభుత్వం సచివాలయాల్లోను, పిహెచ్‌సి కేంద్రాల్లో ప్రజలుకు అవసరమైన మందులు కొరత లేకుండా చూస్తోంది. అయితే ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు పంచాయతీల్లోని గ్రామాల్లో ఇంటింటా తిరిగి అవసరమైన వారికి మందులు అందించాల్సి వస్తోంది. అయితే ప్రభుత్వం సరఫరా చేసే మందులు రోగాలను ఎంతో తగ్గిస్తాయి. గురువారం కాసరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుండేలిగుంట, ఇలగనూరు సచివాలయాల్లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పిలు మాత్రలను కాల్చివేయగా, రెండు బస్తాల సిరఫ్‌లను మాత్రం తెలుగుగంగ కాలువలో పడేసినట్లు స్థానికులు సమాచారం అందించారు. ఇక గుండేలిగుంట సచివాలయ పరిధిలో మాత్రలను కాల్చివేశారు. ప్రజల ఆరోగ్యం కోసం అందించాల్సిన మందులను నిల్వఉంచుకుని ఇలా తగలెట్టడం ఏంటని పలువురు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమకు అనారోగ్యంగా ఉన్నపుడు ఇచ్చి ఉంటే వాడుకునే వారిమి కదా అంటూ ప్రజలు వాపోతున్నారు.సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఎప్పటికప్పుడు వైద్యాధికారులు, సిబ్బంది సర్వేచేసి మందులు పంపిణీచేయాలని ఆదేశాలు జారీచేసినా ఎంఎల్‌హెచ్‌పిలు మాత్రం ప్రజలకు మందులను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చును. ఎంతోఖరీదైన మందులు కూడా ఆరోగ్య కేంద్రాల్లోను, పిహెచ్‌సి సబ్‌సెంటర్‌లోను, సచివాలయాల్లోను ఉన్నా వాటిని ప్రజలకు అందించడంలో వైద్యాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కాసరం పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యాధికారులు, తొట్టంబేడు పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు వైద్యాధికారులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే కాసరం పరిధిలోని సచివాలయాల్లో మాత్రం ఎంఎల్‌హెచ్‌పిలు ఎందుకు ప్రజలకు పంపిణీచేయలేదన్నది ప్రశ్నార్ధకంగా మారింది. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాదికారి ఏం చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

## రిజిస్ట్రేషన్లు లేని క్లినిక్‌లపై కఠిన చర్యలు



**చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్యశాఖ నందు రిజిస్టర్ చేసుకున్న ఆసుపత్రులు, క్లినిక్, ల్యాబ్ వాళ్ళు మాత్రమే ప్రాక్టీస్ చేయాలని రిజిస్టర్ చేసుకోని వారు ఎక్కడైనా ప్రాక్టీస్ చేసినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం చిత్తూరు డివిజన్ స్థాయి పిసిపిఎన్‌డిటి యాక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు అబార్షన్లను, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లైతే శిక్షించడం జరుగుతుందన్నారు. అలాగే స్కానింగ్ కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకున్న రేడియాలజిస్టులు మాత్రమే స్కాన్ చేయాలని ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లైతే వారికి 3 సంవత్సరాల జైలు శిక్ష, 10 వేల రూపాయల జరిమానా, క్లినిక్‌ను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం లింగ నిష్పత్తి ప్రతి వెయ్యి మంది బాలురకు 883 మాత్రమే బాలికలు వున్నారని, దీనిని సమానం చేయాల్సిన ఆవశ్యకత మనందరిపై వుందన్నారు. అలాగే మెడికల్ షాపుల్లో పారాసిటమల్ మాత్రలు మినహాయించి మిగిలిన ఏ మందు అయినా ప్రిస్క్రిప్షన్ వుంటేనే ఇవ్వాలని స్పష్టం చేశారు. అలా చేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటప్రసాద్ హెచ్చరించారు. అలాగే స్వచ్ఛంధ సంస్థలు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజల్లో లింగ నిర్ధారణపై అవగాహన పెంచాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ లత, డాక్టర్ శిరీష, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కీర్తన, ఐసిడిఎస్ నుండి జయంతి, రాజేంద్రప్రసాద్, శేషాద్రి, రమాదేవి, రామారావు, ఇతర ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

## నిత్యఅన్నదాన పథకంకు రూ.1 లక్ష విరాళం



**కాణిపాకం, అక్టోబర్ 10 ప్రభాత వార్త:** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అమలు అవుతున్న శాశ్వత నిత్య అన్నదాన పథకంకు ఓ భక్తుడు గురువారం ఒక లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన దామోదరన్ అనే భక్తుడు అన్నదాన పథకానికి 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాత కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ఇఒ గురుప్రసాద్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ కోదండపాణి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## చెరువు వేలం ద్వారా రూ.15 వేలు ఆదాయం

పాలసముద్రం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

మండల పరిధిలోని వనదుర్గాపురం పంచాయతీ పాత చెరువు వేలం పాట ద్వారా పంచాయతీకి 15,300 రూపాయలు ఆదాయం లభించిందని సర్పంచ్ నరసింహరాజు, కార్యదర్శి సత్యనారాయణలు తెలిపారు. పంచాయతీ పరిధిలోని పాత చెరువు, రాజుగుంట కోన చెరువులను వేలం వేయడానికి వారం రోజుల క్రితం టాంటాం వేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. అయితే రాజుగుంట కోన చెరువు వేలం పాటకు ఎవ్వరు హాజరు కాకపోవడంతో దానిని వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు.

## బాల్య వివాహాలు చేయిస్తే చట్టరీత్యా చర్యలు

వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త



బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని అంగన్‌వాడి కేంద్రాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి హెచ్చరించారు. ఐసిడిఎస్ వెంకటగిరి కార్యాలయం నందు కర్నూల్ జోన్ ప్రాంతీయ ఉప సంచాలకులు సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు వల్ల అనర్థాలకు దారి తీస్తాయని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు సూచనలు ఇచ్చారు. గ్రామాలలో బాల్య వివాహాల గురించి ప్రతి కార్యకర్త అవగాహన కలిగించి, చిన్న వయసులో పెళ్లిళ్ల వలన కలిగే అనర్థాలను వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్స్ అంగన్వాడి కేంద్రంలో వ్రాసి వుంచి కిషోర్ బాలికలకు తల్లులకు అవగాహన కలిగించాలని తెలిపారు.

## మద్యం దుకాణాల టెండర్లకు నేడే చివరి రోజు

కుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త

కుప్పం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్న పది మద్యం దుకాణాలకు గాను శుక్రవారం సాయంత్రం 7గంటలలోగా ఆసక్తిగల వారు టెండర్ దరఖాస్తులు అందజేయవచ్చని కుప్పం ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సైతం దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుకు రూ 2లక్షలు నాన్ రీఫండబుల్ నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఈనెల 14వతేది చిత్తూరులోని సంతపేట ఆర్ఆర్ గార్డెన్‌లో జిల్లా కలెక్టరు ప్రైవేట్ మద్యం దుకాణాలకు లక్కీడ్రా నిర్వహిస్తారన్నారు. దరఖాస్తుదారులు 14న ఉదయం 7గంటలకల్లా చిత్తూరుకు చేరుకోవాలన్నారు. తమతో పాటు ఆధార్ కార్డు తప్పక తీసుకురావాలని కోరారు.

## ఉద్యానవన పంటలకు భారీగా ప్రభుత్వం రాయితీలు

జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి

కుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురు వారం కుప్పం, గుడుపల్లె మండలాల్లో ఆయన పర్యటించి రైతులు పాలీహౌస్‌లో సాగు చేస్తున్న పూలతోటలను, క్షేత్రస్థాయిలో పూల సాగును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కుప్పం ప్రాంతం ఉద్యా నవన పంటలకు అనుకూలంగా ఉందని ఇక్కడి నేల స్వభావం పంటలసాగుకు తోడ్పాటు నందిస్తుందన్నారు. పాలీహౌస్‌లలో రైతులు సాగు చేసే చామంతి, గులాబీ, జరగరా రకాల మొక్కలకు సంబంధించి ఎకరాకు ప్రభుత్వం 8.52లక్షల రాయితీ ఇస్తోందన్నారు. అలాగే క్యాప్సికం, బ్రిటీష్ దోసకాయ సాగుకు ఎకరాకు 2.80లక్షల సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కొత్తగా పాలీహౌస్‌లు ఏర్పాటుచేసుకునే రైతులకు ఎకరాకు 36లక్షలు, అర్థ ఎకరాకు 18లక్షలు రాయితీ ఇస్తున్నామన్నారు. అలాగే బహిరంగ పంటసాగు చేసే రైతులకు ఎకరాకు 16వేలు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కుప్పంలోని సెంటర్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్‌లో రైతులకు రాయితీతో నారు అందిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ మల్చింగ్ చేసే రైతులకు ఎకరాకు 16వేలు, తీగజాతి కూరగాయలైన కాకర, బీర, దొండసాగు చేసే రైతులకు హెక్టారుకు 18750రూ.లు ఇస్తున్నట్లు తెలిపారు. పొలాల్లో రైతులు ఫారంపండ్లు నిర్మించుకుంటే 75వేలు, స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లకు యాభైశాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి డింపుప్రియశ్రీ, రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి వెంకటేష్ మృతి

రామకుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని కొంగనపల్లి తెదేపా నాయకుడు, మాజీ ఎంపిటిసి వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడేవారు. విషయం తెలుసుకున్న తెదేపా నేతలు ఆయన మృతికి నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, చలపతి, చిన్నికృష్ణ, రామూర్తి, రఫీ, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

## పిఎస్‌ఎంను సత్కరించిన రాళ్లబూదుగూరు గ్రామస్తులు

శాంతిపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త



ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నాన్ని గురువారం రాళ్లబూదుగూరు తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. పిఎస్‌ఎం నివాసంలో ఆయనను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ముమ్మందు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మణి, బసవరాజు, బిఎంకుమార్, జయరాజ్, కలీం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరువేల లీటర్ల నాటుసారా ధ్వంసం

కుప్పంరూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త



తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న మండలంలోని గుండ్లమడుగు అటవీ ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటుచేసుకున్న నాటుసారా స్థావరంపై అర్బన్ సిఐ జిటి నాయుడు, సిబ్బంది గురువారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 12 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన ఆరువేల లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఈసందర్భంగాసిఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## దుర్గాదేవిగా ముత్యాలమ్మ

**బంగారుపాళ్యం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం బంగారుపాళ్యం గ్రామ దేవత ముత్యాలమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు మురళీస్వామి, కార్తీక్ స్వాములు మూల విరాట్ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ మూర్తిగా దుర్గాదేవిగా వివిధ పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా హరి, దొరబాబు, ప్రభాకర్‌నాయుడు, ఆనందచౌదరి, రవిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజ, ఆలయ ఛైర్మన్ కృష్ణమూర్తి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం




**చిత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, కయనికట్టు వీధిలో మెప్మా, నగరపాలకసంస్థ సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహం నందు గురువారం చిత్తూరు లైన్స్‌క్లబ్ గోల్డ్, ఎంవి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఫౌండర్ ఎన్‌వి శ్రీధర్‌రెడ్డి సహకారంతో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షులు జోసఫ్‌రాజు తెలిపారు. నిరాశ్రయులకు దాతలు నూతన వస్త్రాలు అందించి వారిచేత కేక్ కట్‌చేయడంతో పాటు అందరినీ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. నిరాశ్రయులను ఆదరించడం మన బాధ్యత అని గుర్తుచేస్తూ, సంస్థ అధ్యక్షులు జోసఫ్‌రాజు నిరాశ్రయులకు సేవలు అందించడం, సకాలంలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వారికి అవసరమైన మందులు, చికిత్సలు చేయించడం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం నిరాశ్రయుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్‌లైన్ శ్రీనివాసమూర్తి, వైస్‌ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ రెడ్డెప్ప, వైస్‌ప్రెసిడెంట్ జమీర్,ట్రెజరర్, రమణ, వసతి గృహసిబ్బంది, నిరాశ్రయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు

– 14 నుంచి 'పల్లె పండుగ ' – ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



**చిత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనేదిశగా అడుగులు వేస్తోందని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ తెలిపారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పిచడంతో పాటు గ్రామస్థాయిలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక బద్దంగా పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర మంత్రి నారాలోకేష్ చేసిన కృషి ఫలితంగా టాటా కన్సల్టెన్సీ సర్వీస్ విశాఖపట్టణంలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభపరిణామని అన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ఈనెల 14వ తేది నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో పలు పనులకు ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలలో ఇప్పటికే గ్రామ సభలను విజయవంతంగా పూర్తి చేశామని, సుమారు రూ, 9.34కోట్ల మేర విలువైన 153 అభివృద్ధిపనులకు ఆమోదం పొందామని, పల్లె పండుగ ఈపనులకు ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు.

## సామాన్యులను గుర్తించే నైజం ఎస్కేఆర్ సొంతం

చౌడేపల్లి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



సామాన్యులను గుర్తించి వారి అభివృద్ధికి బాటలు వేసే నైజం సనాతనధర్మ పరిరక్షణా అవార్డు గ్రహీత ఎస్.కె.వెంకట్రమణారెడ్డికి దక్కుతుందని పలువురు కొనియాడారు. గురువారం ఎస్కేఆర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సామూహిక వివాహాలతోపాటు పేద రిక విద్యావంతులకు ప్రోత్సాహకాలు వంటివి ఇచ్చి ఆదుకొంటున్నారన్నారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువాలతో సత్కరించారు. ఎన్డీయే కూటమి తేదేపా నాయకులు జల్లి మనోహనర్, నరేష్, జనసేన మండలాధ్యక్షుడు బల్లాపురం పురుషోత్తమ్, బిజెపి మండలాధ్యక్షుడు కడియాల మనోహర్ రాయల్, కిసాన్‌మోర్చా ఐటి అధ్యక్షుడు గందోడి ప్రవీణ్‌కుమార్, చనకంటి మహేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎపిఎస్‌ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌కు నేతలచే ఘన సన్మానం

కుప్పం, అక్టోబర్ 10 ప్రభాతవార్త



ఎపిఎస్‌ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంను గురువారం కుప్పం మున్సిపల్ టిడిపి ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు గోపి, నాగరాజు, నరసింహులు, భానుమూర్తిలు ఘనంగా సత్కరించారు. పిఎస్ ఎం నివాసంలో ఆయనను కలిసిన వారు దుశ్శాలువతోఘనంగా సత్కరించారు. ముమ్మందు పిఎస్ మునిరత్నం మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మచ్చలేని నాయకుడిగా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం నలభై ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతూ యువతకు ఆదర్శంగా నిలిచారని వారు కొనియాడారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరనిలోటు

ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి



బాలాయపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి తెలిపారు. శ్రీ శక్తి కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపిపి గూడూరు భాస్క ర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నివాళులు అర్పిం చారు. ఆయన మృతి భారత దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటు అని ఎంపిపి అన్నారు. ఎంతో మందికి రతన్ టాటా ఉపాధి కల్పించారని తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మండల సభలో ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులతో ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న పనులు పురోగతి అడిగి తెలుసుకున్నారు. అటవీ, మేత, పోరంబోకు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలపై ఎంపిపి తహశీల్దార్ పి. శ్రీనివాసులును కోరారు. వైద్యాధికారిణి ప్రమీల మాట్లాడుతూ 104 క్యాన్సర్ స్కానింగ్ వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. వెంగమాంబపురం సచివాలయంలో ఏఎన్‌ఎం సక్రమంగా పనిచేయడం లేదని కార్యాలయానికి రావడం లేదని ఎంపిటిసి సభ్యులు చంద్రమౌళి సభ దృష్టికి తీసుకువచ్చారు. నిడిగల్లు, బొల్లవారిపాలెం క్లాస్ వేలకు రూ. 2 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు, రాగానే పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బి ఏ బాబు తెలిపారు. మన్నూరు, జయంపు, కయ్యూరు గొట్టిగాడు సచివాలయ పనులు ఇంకా పూర్తి కాలేదని పిఆర్ఏఈను ఎంపిపి ప్రశ్నించారు. కడగుంట, పిగిలం గ్రామ పంచాయితీలలో రూ. 5 లక్షలు ఎంపి నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇంచార్జి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు తెలిపారు. కండలేరు నీరు ప్రతి ఇంటికి చేరుస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ శిరీష, వైస్ ఎంపిపిలు వాన పార్వతి, బట్టేపాటి మురళి మోహన్ రెడ్డి, సర్పంచులు వెందోటి సుప్రజా, గాయత్రి, బి. వెంకటసుబ్బయ్య, ఎంపిటిసిలు రామయ్య, ముంగర సుజాత, గోపికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీల్లో చెత్త నుండి సంపదను సృష్టించాలి

డక్కిలి, అక్టోబరు 10 ప్రభాతవార్త



పంచాయితీ కేంద్రాల్లో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాల్లో ఉన్న షెడ్డుల్లో వర్మీ కంపోస్టు యూనిట్లు నిర్వహించి, అందులో తయారైయ్యే ఎరువును రైతులకు విక్రయించడం వల్ల పంచాయితీలకు ఆదాయం వస్తుందని ఎంవోటీలు వెంకటాద్రి, వెంకటేశ్వర్లు తెలిపారు. గత నాలుగు రోజులు నుంచి డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఉపసర్పంచ్‌లు,వార్డు మెంబర్లుశిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది.ముగింపు సమావేశంలో వారు మాట్లాడుతూ పలు పంచాయితీల్లో చెత్తను సేకరించేందుకు సిబ్బంది ఉన్నారని చెప్పారు. తడిచెత్త,పొడి చెత్త వర్వేరుగా సేకరిస్తున్నట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న ఆర్థికవనరులను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

## డక్కిలి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కోటేశ్వరరావు

డక్కిలి, అక్టోబరు 10, ప్రభాతవార్త

డక్కిలి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వెంకటగిరి ఎంపీడీవో కోటేశ్వరరావును నియమించారు. ఈ మేరకు గురువారం ఈ ఆదేశాలు మండల పరిషత్ కార్యాలయంకు అందాయి. ఆయన ఇక్కడ గతంలో సీనియరు అసిస్టెంట్‌గా, రెగ్యులర్ ఎంపీడీవోగా పనిచేశారు. గత పది రోజులు నుంచి ఎంపీడీవో లేకపోవడం వల్ల ఉపాధిబిల్లులురావడం లేదని, ఉపాధి హామీ పనులు నిలిచిపోయినట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంకటగిరిఎంపీడీవోకుఅదనపుబాధ్యతలుఅప్పగిస్తూగురువారం ఇక్కడి కార్యాలయంకు ఆదేశాలు వచ్చాయి.

## శ్రీ కన్యకా పరమేశ్వరికి మహిషాసురమర్ధిని అలంకారం

సూళ్లూరుపేట, అక్టోబర్ 10 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు రత్నాంగి అలంకారం, ఉత్సవమూర్తికి మహిషాసురమర్ధిని అలంకారంతో గురువారం భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన ఆశా నృత్య ప్రదర్శన కార్యక్రమం అలరించింది. అష్టలక్ష్మి అమ్మవార్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీకన్యకా పరమేశ్వరిదేవిని దర్శించుకున్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి దేవస్థానం కార్యనిర్వాహక సంఘం అధ్యక్షులు కాకి శ్రీరామమూర్తి, కార్యదర్శి పైడిమర్రి కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## రతన్ టాటా మరణం పట్ల టిడిపి నాయకులు సంతాపం

కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణం పట్ల కోట మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ సర్వోత్తమరెడ్డి, జిల్లా టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, జిల్లా టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు, కోట ఎంపిటిసి షంషుద్దీన్ తదితరులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రతన్ టాటా మరణం పారిశ్రామిక రంగానికి, దేశానికి తీరని లోటన్నారు. అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక దిగ్గజంగా ఎదిగినా సామాన్య జీవనం సాగించిన మహోన్నత వ్యక్తి రతన్‌టాటా అని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని చెప్పారు.

## పేద మహిళలకు చీరలు పంపిణీ



కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త

ఆకలి తీర్చే అన్నపూర్ణగా కీర్తిప్రతిష్టలు పొందిన దివంగత నేత నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి సతీమణి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తల్లి కీర్తిశేషులు నల్లపరెడ్డి సుదర్శనమ్మ 12వ వర్ధంతి కోటలో గురువారం జరిగింది. కోటలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో సుమారు 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి, పాదర్తి కోటారెడ్డి, బాలకృష్ణారెడ్డి, తీగల సురేష్‌బాబు, గురుస్వామి, ఉలవకాయల ప్రసాద్, శ్రీరాం సుధాకర్, అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, బాబురావు తదితరులు పాల్గొని సుదర్శనమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## జయమ్మకు ప్రముఖుల నివాళి

కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త



కోట మండలం రాఘవాపురానికి చెందిన యువ పారిశ్రామికవేత్త మర్రిబోయిన రాజేంద్ర తల్లి జయమ్మ ఇటీవల మృతిచెందారు. ఆ మేరకు గురువారం గ్రామంలో దిశ క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖులు, తెలుగుదేశం నాయకులు రఘురాం ముదిరాజ్, తానంకి నానాజి, మండల టిడిపి అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, వైసీపీ నాయకులు గురుస్వామి, రమేష్, వెంకటకృష్ణయ్య గౌడ్, బిజెపి ప్రముఖులు రాఘవాపురానికి తరలివచ్చి జయమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. మర్రిబోయిన రాజేంద్రను పరామర్శించి ఆయనకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు.

## చిట్టమూరు ఎంపిడిఓగా మనోహర్ గౌడ్ పదవీ బాధ్యతలు

చిట్టమూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త



చిట్టమూరు మండల అభివృద్ధి అధికారిగా ఎస్.మనోహర్ గౌడ్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చిట్టమూరు మండలంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ ఇటీవల వాకాడు మండల ఎంపిడిఓగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయనను తిరిగి చిట్టమూరు ఎంపిడిఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిట్టమూరు ఎంపిడిఓ షాలెట్ నెల్లూరు జిల్లా సంగానికి బదిలీ అయిన నేపథ్యంలో, ఆమె స్థానంలో మనోహర్ గౌడ్ బాధ్యతలు చేపట్టడం పట్ల పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పూలమాలలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

## మేకలు గొర్రెలకు నట్టల నివారణ ముందు పంపిణీ

పశు సంవర్ధక శాఖ ఏడి స్వామి బాబు

వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

2024 – 25 సంవత్సరం మొదటి విడత గొర్రెలు, మేకల నట్టల నివారణ కార్యక్రమం వెంకటగిరి, డక్కిలి మండలాలలో ప్రారంభమైందని పశు సంవర్ధక శాఖ పిడి స్వామి బాబు తెలిపారు. అక్టోబర్ 25వ తేది వరకు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం రెండు మండలాలలోని ప్రతి గ్రామంలో గొర్రెల, మేకలకు పెంపకం దారుల ఇంటి వద్దకే పశుసంవర్ధక శాఖ సిబ్బంది వచ్చి నట్టల నివారణ మందు ఉచితంగా తాగించినట్లు తెలిపారు. ఈ అవకాశంను రైతు సోదరులు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ఇప్పటికే నట్టల నివారణ మందు ఆయా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని తెలిపారు.

## దుర్గాదేవి అవతారంలో మహాలక్ష్మమ్మ అమ్మవారు

వాకాడు, అక్టోబర్ 10, ప్రభాతవార్త

దుర్గాదేవి ధైర్యానికి ప్రతీకగా నిలిచి నవరాత్రుల్లో ఎనిమిదో రోజు అయిన విశేషంగా దర్శనమిచ్చింది. గురువారం వాకాడు మండలంలోని గంగన్నపాలెం గ్రామంలోని వెలసివున్న మహాలక్ష్మమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు అయోధ్య బాలచంద్ర శెట్టి ఆధ్వర్యం లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## వాకాడు ఎంపిడివోగా అన్నపూర్ణ రావు



వాకాడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త

వాకాడు ఎంపిడిఓగా అన్నపూర్ణరావు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి, త్రాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. అనంతరం మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు, ఈవోపిఆర్డి ఉమా మహేశ్వర రావు, పిఆర్ఏఈ కిరణ్, కార్యదర్శిలు పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

***– పల్లె పండుగను విజయవంతం చేద్దాం..***

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పల్లె పండుగ కార్యక్రమంను, విజయవంతం చేయాలని అన్నపూర్ణరావు సిబ్బందికి సూచించారు. ఈ నెల 14 నుండి 20వ తేది వరకు పల్లె పండుగ జరుగుతుందని 18వ తేది గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు

గూడూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త



దసరా పండుగ పురస్కరించుకుని నిబంధనలు అతిక్రమిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి వీవీ రమణకుమార్ పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణంలోని హైస్కూల్ రోడ్డులో ఉన్న పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో డిఎస్పి వివి రమణ కుమార్ ఆధ్వర్యంలో విజయ దశమి పండుగ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న దసరా పండుగ సందర్భంగా సుమారు 15 వరకు అమ్మవార్ల గ్రామోత్సవాలు ఉంటాయని, ఊరేగింపు అన్ని వీధుల్లో తిరగనున్న నేపథ్యంలో డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

గూడూరు, అక్టోబర్ 10, ప్రభాతవార్త



పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అనిజనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర రావు పేర్కొన్నారు. గురువారం గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో పారిశ్రామిక దిగ్గజం, మానవతావాది రతన్ టాటాకి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతీయ కీర్తిని ఇనుమడింపజేసిన ముద్దుబిడ్డను కోల్పోయాం, వ్యాపారాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో తరించిన ధ్రువతార రాలిపోవడం దేశానికే తీరని లోటు అని, టాటా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారు ఎనలేని సేవలు అందించార్గన్నారు. జనసేన పార్టీ గూడూరు నియోజకవర్గం పిఒసి మోహన్ మాట్లాడుతూ భారతదేశం ముద్దుబిడ్డ, మహోన్నతమైన వ్యక్తి రతన్ టాటా వారీ మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నాగార్జున్, సాయికిరణ్ చిలుకూరు మండలం ప్రధాన కార్యదర్శి మనోజ్, జనసైనికులు మధుసూధన్, వెంకటేష్, సనత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## బలరామ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వెంకటేశ్వర స్వామి

వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త



దసరా ఉత్సవాల్లో భాగంగా వెంకటగిరి పట్టణం కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి బలరామ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయని సమేత కైలాసనాథ ఆలయంలో వెలసి ఉన్న కాత్యాయని అమ్మవారు దుర్గాదేవి ఆలంకరణలో అలంకారణంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## ఆర్థిక సహాయం అందజేసిన కాపు బలిజ సంక్షేమ సంఘం నాయకులు

వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

ఐదో వార్డ్‌లో గల అడపాల అంజనమ్మ అనే ఆమెకు ఆపరేషన్ ఉన్నందున బలిజ చేయూత ఇచ్చారు. శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ ట్రస్ట్ వెంకటగిరి వారు కలిసి ఆమెకు పదివేల రూపాయిలు ఆర్థిక సహాయం అందించటమైనది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తోట కృష్ణయ్య, కోన వెంకటేశ్వర రావు, కోన పద్మావతి, తిరుపాలు తులసి దాసు, రవీంద్ర, మాలే హరిప్రసాద్, జెల్లీ రాజేష్, సురేష్, దేగల రేవతి సుంకర, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్కిమ్స్‌లో శిక్షణ: ప్రభుత్వ ఉద్యోగులుగా జీవితం

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలో నిర్వహించబడుతున్న స్కిమ్స్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ జీవితాలను సుఖవంతంగా జరుగుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. కళాశాలలో 2012-14 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం కరస్పాండెంట్ మిద్దెల హరి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ తాము ప్రారంభించిన డిఎడ్ తరగతుల్లో శిక్షణ పొందిన పలువురు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఎంపికై భావి భారత పౌరులను తీర్చి దిద్దుతూ తమ జీవితాలను సుఖవంతంగా సాగుతుండటం తనకు ఎంతో ఆనందం కల్గిస్తుందన్నారు. కేవలం వ్యాపారంగానే కాకుండా సామాజికసేవకు ప్రాధాన్యత ఇస్తూ తాము ప్రారంభించిన కోర్సుల్లో శిక్షణ పొందిన వారు ఎంతో మంది నేడు ఉపాధ్యాయులుగా ఉండటం తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు నేటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ కళాశాలలో శిక్షణ పొందిన తాము కేవలం విద్యపైనే కాకుండా గుణాత్మకమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోటం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉన్నత స్థాయిలో ఫలవంతమైన జీవితాన్ని అనుభవించ గల్గుతున్నామన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కరస్పాండెంట్ మిద్దెల హరి, ప్రిన్సిపల్స్‌ను సత్కరించారు. ఆశీర్వాదాలు పొందారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ అంజూరు శ్రీకుమార్, అధ్యాపకులు సత్యనారాయణరావు, అన్వర్ ఖాన్ బహమని, చంద్రశేఖర్, స్కిమ్స్ ప్రిన్సిపల్ గీతాదేవిలు పాల్గొన్నారు.

## పార్టీ సీనియర్ నాయకుని పరామర్శించిన బృందమ్మ

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలో పార్టీ ఆవిర్భావం నుంచి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉన్న ముత్తారెడ్డిని గురువారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పరామర్శించారు. మండలంలోని అరవకొత్తూరులో నివాసముంటున్న ముత్తారెడ్డి పార్టీ కి ఎనలేని సేవలందించారు. ఆయన అనారోగ్యానికి గురి కావటంతో ఆయన్ను పరామర్శించారు. ఆమెతోపాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మాజీ కౌన్సిలర్ బి.రేణుకాదేవి పాల్గొన్నారు.

## రేపు జీ తెలుగు కుటుంబం

తిరుపతి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

నిరంతరం ప్రేక్షకులకు వినోదం అందిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు 12వతేదీ శనివారం సాయంత్రం 6గంటలకు జీ తెలుగులో 2024 అవార్డుప్రదానోత్సవ కార్యక్రమం ప్రసారమవుతుంది. ఛానల్ ఉన్నతికి కృషి చేస్తున్న ప్రతిభావంతులైన నటీనటులు, కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు అందరినీ గౌరవిస్తూ అందించే సత్కారమే జీతెలుగు కుటుంబం అవార్డు ప్రదానో త్సవమని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. ప్రతి ఏటా ఘనంగా ఈ అవార్డు వేడుకలు జరుగు తాయన్నారు. అవార్డుల ప్రదానోత్సవం మొదటిభాగం 12న సాయంత్రం 6గంటలకు జీ తెలుగులో వీక్షించాలని కోరారు. యాక్షన్ ప్రియులకు లైవ్లో గగన్‌రౌడీలతో చేసే ఫైట్ సీక్వెన్స్ ఆసక్తికరంగా సాగుతుందన్నారు.

## శ్రీచిన్నమస్తాదేవి అలంకరణలో దుర్గాదేవి

రామచంద్రాపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో గురువారం శ్రీచిన్నమస్తాదేవి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరనంద మహాభారతి స్వామి పర్యవేక్షణలో పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వివిధ సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని శ్రీచిన్నమస్తాదేవి అలంకరణలో దుర్గాదేవిగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## దుర్గామాత అలంకరణలో ఏకవీరదేవి



రామచంద్రాపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

సూరావారిపల్లి సమీపంలో వెలసియున్న సురభీ గోసంరక్షణశాలలో గురువారం దుర్గామాత అలంకరణలో ఏకవీరదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ అమ్మవారికి వివిధ రకాల సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, పలురకాల పుష్పాలతో అమ్మవారిని దుర్గాదేవి అలంకరణలో తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ మృతి



దొరవారిసత్రం, అక్టోబర్ 10 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మద్దూరు రామకృష్ణ (38) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న దొరవారిసత్రం ఎంపిడిఓ గోవర్ధన్ ఈ సందర్భంగా మద్దూరు రామకృష్ణ మృతదేహానికి నివాళి అర్పించారు. గత 15 సంవత్సరాలుగా ఉచ్చూరు పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకున్న రామకృష్ణ మృతి పట్ల గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. రామకృష్ణకు ఇద్దరు పిల్లలు ఉన్నారు

## డివిసత్రంలో వర్షం ...

**దొరవారిసత్రం అక్టోబరు 10 ప్రభాతవార్త;** మండలంలోని పలుగ్రామాల్లో గురువారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన ఓమోస్తారు వర్షం కురిసింది. ఈవర్షంతో గ్రామాల్లో ప్రజలు, రైతులు ఆనంధం వ్యక్తం చేస్తున్నారు. గతకొన్ని రోజులు నుండి భానుడు భగభగ మంటూ మండుతుండటంతో ప్రజలు ఎండతీవ్రతకు తట్టుకోలేక అవస్థలు పడుతున్న సమయంలో వర్షం కురవడంతో వాతావరణం కొంతవరకు చల్లబడింది. ఈవర్షంలో గ్రామాల్లో వీదులు, రోడ్లు బురదమయంగా మారాయి. గ్రామాల్లో ఎల్లిపైరు సాగుచేపడుతున్న రైతులకు వర్షాలు కురవడం ఊరటనిచ్చింది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై సాగుకు సర్వంసిద్దం చేస్తున్నారు.

## రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

దేశ విదేశాలలో 23 కంపెనీల ద్వారా 33 లక్షల కోట్లతో ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న కీర్తిశేషులు రతన్ టాటాకు భారతరత్న పురస్కారం అందించాలని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా ముందు రచయిత దేవరాజులు, సేవా సహాయకులు భాషా తదితరులతో కలిసి రమేష్‌నాథ్ మాట్లాడుతూ దాతృత్వానికి కేరాఫ్ రతన్ టాటా అని కొనియాడారు. కరోనా సమయంలో 1500 కోట్లు రతన్ టాటా విరాళంగా ప్రకటించారని గుర్తు చేశారు. భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తంగా చేసిన ఘనుడు రతన్ టాటా అని కొనియాడారు. రతన్ టాటాను ఇండియన్ స్టాంప్‌పై చూడాలన్నారు. రతన్ టాటాను ఇండియన్ స్టాంప్ పై చూడాలన్నారు. రతన్‌టాటాఆదాయంలో65శాతంనుచారిటబుల్‌ట్రస్ట్‌ద్వారా ప్రజలకు సేవలందించడం హర్షనీయమన్నారు.

## శీతలాంబ ఆలయంలో పూజలు-అన్నదానం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో వెలసిన శీతలాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం బృందమ్మకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా మాజీ కౌన్సిలర్ సెంజిగరం సుప్రజ పుట్టినరోజు కావడంతో వారి దంపతులు సుప్రజ, వేలులకు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, రాష్ట్రమహిళా నాయకురాలు రేణుకాదేవి, ఆర్ముగం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన అధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

పట్టణంలోని తెట్టు వద్ద ఉన్న జనసైనికులు కత్తిమణి కుమార్తె పుట్టినరోజు సందర్భంగా డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమానికి రెండు బస్తాలు బియ్యం అందించారు. కాగా చిన్నారి వద్ద జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కోట వినుత కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి గురువారం డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ఆర్టీసి బస్టాండు ఆవరణలో చేస్తున్నామని నిరుపేదలకు అన్నదానం చేయడంలో సంతోషం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## జగన్ గుడ్ బుక్‌లో నిజాలనే రాసుకోవాలి

### దేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్ టాటా : బిజేపి నాయకులు



తిరుపతి హెల్త్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకుతున్న వైసిపి నేడు గుడ్ బుక్‌ను తెరపైకి తీసుకువచ్చిందని అందులో ఎన్‌డిఏ పాలనలోని మంచిని రాసుకోవాలని భారతీయ జనతా పార్టీ నేతలు భాను ప్రకాశ్ రెడ్డి, వరప్రసాద్, డాక్టర్ దగ్గుబాటి శ్రీహరి రావు, రాజ్ కుమార్, జీవన్ రాయల్ తదితరులు కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పుంగనూరు పర్యటనలో గుడ్ బుక్ ప్రస్తావన తీసుకొచ్చారని తెలియజేశారు. వైసిపి పాలనలో రాసుకునే దానికి మంచి ఏమి చేయలేదని విమర్శించారు. తమ కూటమి పాలనలో రాసుకోవడానికి ఎన్నో మంచి పనులు ఉన్నాయని కొనియాడారు. గుడ్ బుక్‌లో ఆత్మకథలు, జగన్ కథలు రాసుకోవచ్చునని చురకలు విసిరారు. అనంతరం రతన్ టాటాకు బిజెపి నాయకులు తరపున అశ్రునివాళ్లు అర్పించారు.

## శ్రీ పిడికిలి గంగమ్మతల్లి అందరినీ చల్లగా దీవించమ్మా

పుత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బజారు వీధిలో వెలసిన గ్రామదేవత పిడికిలి గంగమ్మతల్లి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని శ్రీ దుర్గాదేవి అలంకరణతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయంలోని మూలవర్లు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేసి, అనంతరం అమ్మవారిని వివిధపుష్పాలతో సుందరంగా శ్రీ దుర్గాదేవి అలంకరణతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఉభయ దాతలుగా ఎల్.చంద్రశేఖర్, ఎన్.శంకర్‌రాయల్, ఇంజం ఆనంద్‌లు వ్యవహరించారు. గంగజాతర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సారూ...మురికి కాలువలు శుభ్రం చేయండి

విజయపురం, అక్టోబరు 10 ప్రభాతవార్త:



సారూ... మురికి కాలువలను శుభ్రం చేయండంటూ మండలంలోని జంబాడ, కోసలనగరం వాసులు కోరుతున్నారు. వీధులకు వర్షపునీరు కూడా కాలువలు ప్రవహించే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. కాలువల్లో చెత్తచదారం, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండడం వలన నీరు మురుగు నీరు చేరి దోమల బెడద ఎక్కువవుతున్నాయని ఆరోపిస్తున్నారు. తరచూ వర్షాలు కురవడం వలన రోగాల బారిన పడుతున్నారని, అధికారులు స్పందించి మురుగునీటి కాలువల్లో పూడిక తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యూ ట్యూబర్‌కు జైలు శిక్ష, జరిమానా



అప్పట్లో నిందితుని అరెస్టు చూపుతున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ హీరా సింగ్(ఫైల్‌ఫోటో)

రేణిగుంట, అక్టోబరు 10 ప్రభాతవార్త:

రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ స్టేషన్ పరిధిలో ఏర్పేడు-రాచకున్నేరి రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై వివిధ వస్తువులను ఉంచి వెల్టెన్ రాక్స్ పేరుతో యూ ట్యూబ్ ఛానల్ సృష్టించి రీల్స్ చేసి యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన కొంగర రామిరెడ్డికి నెల్లూరు రైల్వే స్పెషల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినోద్ ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు...ఇంజనీరింగ్ విద్యార్థి కొంగర రామిరెడ్డి వెల్టెన్ రాక్స్ పేరుతో యూ ట్యూబ్ ఛానల్ పెట్టి రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్లు, ద్విచక్రవాహనాలు, బొమ్మలు, పండ్లు, క్రాకర్లు, చేపలు, చికెన్, గుడ్లు మొదలైన వస్తువులను ఉంచి రైళ్లు ఢీ కొడుతున్న దృశ్యాలను చిత్రీకరించి వీటిని యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేవాడు. ఇతని రీల్స్ ట్రెండింగ్‌గా మారడంతో ప్రజాదరణతో పాటు ఆర్థిక ఆదాయాలు లభించాయి. 2019 సంవత్సరం రామిరెడ్డిపై అప్పటి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ హీరాసింగ్ రైల్వే చట్టంలోని సెక్షన్ 147,153 కింద కేసు నమోదు చేశారు. 2021 నుంచి 2024 ప్రస్తుత రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సందీప్ కేసును దర్యాప్తు చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించడంతో న్యాయమూర్తి అతనికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. తీర్పును ఉద్దేశించి సందీప్ మాట్లాడుతూ రైల్వే ఆస్తులు ప్రజల ఆస్తులు అన్నారు. రైల్వే రూల్స్ అతిక్రమించిన వారినఇ చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. రైల్వే ట్రాక్ మధ్య నడవడం, గేటు వేసినప్పుడు రైల్వే ట్రాక్‌లను క్రాస్ చేయడం, రైల్వే ట్రాక్ మధ్య విన్యాసాలు చేయడం, అనుమతులు లేకుండా రైళ్ళలో సెల్‌ఫోన్ల ద్వారా వీడియోలు తీయడం నేరమన్నారు.

## సంప్రదాయాలను కాపాడండి:



శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి కొన్ని సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలున్నాయని అయితే గత పాలనలో మితిమీరిన రాజకీయ నాయకుల జోక్యంతో దేవాదాయశాఖ వ్యవస్థ భ్రష్టుపట్టిందని ప్రస్తుత పాలకులు అయినా దానిని కాపాడాలని బిజెపి, టిడిపి పర్యటన సమన్వయ కర్త జివి అమర్‌నాథ్ డిమాండ్ చేసారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి పురాతన కాలం నుంచి ఓ ప్రాధాన్యత ఉంది. అందులో భాగంగా ఆలయ ప్రాశస్త్యాన్ని తెలిపే విధంగా తిరుమంజనం వారి గోపురం వద్ద27 నక్షత్రాలకు గుర్తుగా 26 రాతి మెట్లను నాడు ఆలయ నిర్మాణదారులు ఏర్పాటు చేసారన్నారు. అయితే గత పాలకుల హయాంలో ఈ ప్రాధాన్యతను తుంగలో తొక్కి కాంట్రాక్టర్ల కోసం వారి లబ్ధి కోసం మెట్లపై చెక్క మెట్లను ఏర్పాటు చేసారు. నిర్మించినపుడు తాత్కాలికం అన్న అధికారులు శివరాత్రి పూర్తి అయి ఆర్నెల్లు గడుస్తున్నా వాటిని తొలగించక మెట్ల ప్రాధాన్యతను కనుమరుగు చేశారని ఇప్పటి పాలకులు, అధికారులు గుర్తించి పురాణ ప్రాశస్త్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

## 12న శోభా యాత్ర

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో విజయదశమి సందర్భంగా శనివారం శోభాయాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పోలసామి స్వర్ణమూర్తి గురువారం తెలిపారు. శనివారం సాయంత్రం 5గంటలకు విజయదశమి సందర్భంగా రాజగోపురం, గాలిగోపురం వద్ద నుంచి ఏడుగంగమ్మ గుడి వరకు స్వామి అమ్మవార్ల పార్వేట ఉత్సవం సందర్భంగా భక్తిశ్రద్దలతో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు వివరించారు. 7-15 సంవత్సరాల మధ్య చిన్నారులు 108 మందితో ఈ శోభాయాత్రను శోభాయమానంగా నిర్వహించ నున్నట్లు వివరించారు, ఆధ్యాత్మిక చింతన కల్గిన వారు పాల్గొని విజయవంతం చేయాలని స్వర్ణమూర్తి కోరారు.

## గ్రంధ ప్రచురణకు విరాళం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ఎన్నో నిగూఢంగా ఉన్న అంశాలను క్రోఢికరిస్తూ భావి తరాలకు సమాచారం అందించుటకు పాత్రికేయుడు ఆధ్యాత్మిక చింతన కల్గిన కవి పెరిపైడి దొరస్వామిరెడ్డి ప్రయత్నిస్తున్నారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి క్షేత్ర మహాత్మ్యానికి సంబంధించి ఉపనిషత్తుల ఆధారాలతో 'శ్రీకాళహస్తీశ్వర మహాక్షేత్ర మహాత్మ్యం-తాత్విక రహస్య ప్రకాశం, శ్రీగణపతిపురాణం, శివ తత్వ రహస్య ప్రకాశంలను ప్రచురించారు. ప్రస్తుతం శ్రీ జ్ఞానామృతం అనే గ్రంధాన్ని రూపకల్పన చేస్తున్నారు. మన సంప్రదాయాలు శివతత్వాన్ని భావి తరాలకు అందించి వారిలో ఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తి భావం కల్పించుటకు ఆయన చేపట్టిన గ్రంధ రచనల్లో గురువారం డిగ్రీ పూర్వ విద్యార్థులు రూ.54వేల రూపాయలను విరాళంగా గ్రంధ కర్త పి.దొరస్వామిరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా దొరస్వామి రెడ్డి మాట్లాడుతూ సమస్త పురాణాల సారాంశం అయిన జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనే తత్వాన్ని ఈ గ్రంధం ద్వారా తెలియజేయటనే లక్ష్యంగా వివరించారు. జ్ఞానామృతం గ్రంధంలో శ్రీదేవి భాగవతం, సౌందర్యలహరి, శ్రీలలితా సహస్రనామ స్త్రోత్రం, కనకధారా సప్తావం వంటి గ్రంధాల రహస్యాలను పండిత పామరులకు అర్థమయ్యేరీతిలో అందించబడుతుందన్నారు. ఈ గ్రంధాన్ని కార్తీక మాసం నవంబర్ 24న తమిళనాడులోకి కాంచీపురం కామాక్షమ్మ ఆలయంలో ఆవిష్కరణ చేయాలని భావిస్తున్నట్లు వివరించారు. సహకరిస్తున్న పూర్వ విద్యార్థులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## రతన్ టాటాకు నివాళులు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



పద్మవిభూషణ్ రతన్‌టాటా మరణం దేశానికి తీరని లోటు అని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పాత నెల్లూరుబస్టాండు కూడలి వద్ద ఏర్పాటు చేసిన రతన్ టాటా సంతాప సభలో కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పారిశ్రామి వేత్త రతన్‌టాటా సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన మృతి భారత దేశానికి తీరని లోటు అన్నారు. ఈ సంతాపసభకు పట్టణ పార్టీ అధ్యక్షుడు గరిక పాటి రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభకు కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రతన్‌టాటా ఛారీటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి విద్య, వైద్యం, ఐటి రంగాల్లోనూ, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన అందించిన సేవలు ఎన్నటికీ మరువరానిదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గెలిచిన తరువాత రాష్ట్రాభివృద్ధికి ట్రస్టు ముందుకు రావటం అభినందనీయం అన్నారు. ఈ సంతాప సభలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పుణ్యం ఢిల్లికుమార్‌రెడ్డి, ఎపెదపాళెం రవి ఆచారి, జ్ఞానగారి పోలయ్య, పట్టణ యువమోర్చ అధ్యక్షులు తానికొండ్ల భరత్, సజ్జల హరీష్, సూరబిందుకుమార్, ధనూష్, సుమంత, చోటు, సిద్దు, నాని గిరిధర్‌సాయి, పవన్ పాల్గొన్నారు.

## మద్యం సేవించి ఆటో నడిపితే ఖబడ్దార్

చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



మద్యం సేవించి ఆటో నడిపితే ఖబడ్దార్ అంటూ సిఐ సుబ్బరామిరెడ్డి డ్రైవర్లను హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన ఆటో డ్రైవర్లకు నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. మీ కుటుంబ జీవనం కోసమే ఆటో నడుపుతున్నారనే విషయాన్ని విస్మరించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలను తప్పనిసరి కలిగివుండాలన్నారు. చంద్రగిరి కూడళ్ళలో ఆటోలను క్రమపద్దతిలో నిలపాలని అన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు సృష్టిస్తే అపరాధం తప్పదని తేల్చిచెప్పారు. ప్రయాణికులతో, ముఖ్యంగా మహిళలతో మర్యాదపూర్వకంగా మెలగాలని అన్నారు. మద్యం సేవించి ఆటో నడిపితే రూ.10 వేలు చలానాతో పాటు నెల రోజులు జైలు శిక్ష

# తిరుపతి డివిజన్

## మెరుగైన వైద్య సేవలను అందించండి - జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

నగరి, అక్టోబరు 10 ప్రభాతవార్త:



ఏరియా ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లు పేర్కొన్నారు. గురువారం నగరి ఏరియా ఆస్పత్రిలో రూ.34 లక్షల తుడానిధులతో నూతనంగా అందించిన అడ్వాన్స్, లైఫ్ సపోర్ట్ వాహనాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లు ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలను అందించాలని తెలిపారు. దీంతో పాటు ఆస్పత్రికి అవసరమైన అత్యవసరమైన మందులను ఆస్పత్రి డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి కొనుగోలు, చేయాలని సూచించారు. ఏరియా ఆస్పత్రికి నూతనంగా అందించిన అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌కు సిబ్బందిని కేటాయించి వైద్యసేవలు నిమిత్తం అందుబాటులో ఉండాలన్నారు. ఏరియా ఆస్పత్రికి రోజుకు 200 మంది ఓపీ కేసులు రావడం జరుగుతుందని, నెలకు 170 ప్రసవాలు చేయడం జరుగుతుందని, ఈ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, గైనిక్, పీడీ యాట్రిక్, జనరల్ సర్జరీ, డేర్మటాలజీ, ఫిజియోథెరఫీ, ఈఎన్‌టీ, రేడియాలజీ విభాగాల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ జరీనాబేగం కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీలకు వివరించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా జాయింట్ కలెక్టర్‌లు పరిశీలించారు. అడ్వాన్స్, లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లో(వెంటి లేటర్, ఆక్సిజన్ సరఫరా, ఇన్ఫ్యూజన్ పంప్ సౌకర్యం) వసతులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీసీహెచ్ఎస్ ప్రభావతిలు వివరించారు. కార్యక్రమంలో నగరి ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో కార్తీకేయ, నగరి తహసీల్దార్ రవి, సంబంధిత అధికారులు, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పాకాల మీదుగా పీలేరుకు బస్ సౌకర్యం కల్పించండి

పాకాల, అక్టోబర్ 10, ప్రభాతవార్త



పాకాల మీదుగా పీలేరుకి బస్సు సౌకర్యం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కనీసం రోజుకు రెండు బస్సులైన కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సౌకర్య కల్పనలో ముందు వరుసలో వున్న పులివర్తి నాని ప్రతినిధ్యం వహిస్తున్న పాకాల నుంచి గత ఐదు సంవత్సరాల నుండి పీలేరుకి బస్సులు లేవని కొత్త సర్వీసులు ఏర్పాటు చేయమని ఏపిఎస్ఆర్‌టిసి అధికారులను ప్రజలు పత్రికా ముఖంగా గత నెలలో కోరగా ఇంత వరకు స్పందన రాలేదు. నిత్యం విద్య, వైద్యం, ఉద్యోగ, వ్యాపారా రీత్యా పాకాల నుంచి పీలేరు రాయచోటి ప్రయాణం చేసి వారి కోసం బస్ సౌకర్యం కోరగా అధికారులలో చలనం రాకపోవటం చాలా బాధాకరం అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎంఎల్‌ఏ నాని చొరవ ఈ మార్గంలో నూతన బస్సు సౌకర్యం సాకారం కావాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఆధార్‌లో పిన్ కోడ్, జిల్లా మార్పుకు అవకాశం

### శ్రీసిటీ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

సత్యవేడు, అక్టోబరు 10 ప్రభాతావర్త:

శ్రీసిటీ పరిధి గ్రామస్తులు తమ ఆధార్‌కార్డులో పిన్ కోడ్, జిల్లా పేరు మార్పుకు అవకాశం ఉంది. శ్రీసిటీ సబ్ పోస్టాఫీసులో ఇందుకు సంబంధించి ప్రత్యేక నమోదు కేంద్రం ఏర్పాటు చేశారని తెలిపారు. శ్రీసిటీ పరిధిలోకి వచ్చే ఇరుగుళం, మల్లావారిపాళెం వెస్ట్, ఈస్ట, ఆరూరు, ఆరూరు కండ్రిగ, చిగురుపాళెం, గొల్లపాళెం, మత్తెరమిట్ట, చిలమత్తూరు, చెరివి, మాధనపాళెం తదితర గ్రామస్తులు తమ ఆధార్ కార్డులను తీసుకొచ్చి శ్రీసిటీ ఇంజనీరింగ్ కార్యాలయ సమీపంలో ఉన్న సబ్ పోస్టాఫీసు వద్ద ఇచ్చి ఆధార్‌లో తిరుపతి జిల్లా, శ్రీసిటీ పరిధి పిన్ కోడ్ మార్పు చేసుకోవాల్సిందిగా కోరుతున్నారు. గురు, శుక్రవారాల్లో అవకాశం సబ్ పోస్టాఫీసు వద్ద కల్పించడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం మేరకు 9490008875 ఫోన్ నెంబరుని సంప్రదించాలన్నారు.

## ఏపి రీసెట్ 2023-24 మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి విద్య, అక్టోబర్ 10, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపిఆర్ సెట్ 2023-24 లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ సందర్భంగా రీసెట్ 2023-24 చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు కన్వీనర్ ఆచార్య పి.సి వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని 17 విశ్వవిద్యాలయాలో సైన్స్, ఆర్ట్స్ మేనేజ్మెంట్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో సిహెచ్‌డి(పార్ట్ టైం, ఫుల్ టైం)2566 సీట్లకు వెబ్ వెరిఫికేషన్ జరిపి సీట్ల కేటాయింపు చేశామని తెలిపారు. తొలిదశలో ఫుల్ టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1237 మంది, మొత్తం 2008 మందికి కేటాయింపు జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయింపు జరిగిందని, సీట్లు కేటాయింపు జరిగిన వారు ఆన్లైన్లో రిపోర్టు చేసి, సంబంధిత విశ్వవిద్యాలయాల్లో నేరుగా 14-10-2024 నుండి 19-10-2024 వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సీటు ఖరారు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు హెచ్‌టిటిపి://విఇటిఎస్.ఏపిఎస్‌సిహెచ్ఇ.ఏపి.జిఓవి.ఇన్/ఏపిఎస్‌సిహెచ్ఇ/ఏపిఎస్‌సిహెచ్ఇహెచ్ఓఎమ్ఇ.ఏఎస్‌పిఎక్స్ వెబ్సైటు చూడాలని కోరారు.

## ఎన్‌సిసి క్యాడెట్‌ల ట్రెక్కింగ్ విజయవంతంగా ముగిసింది

తిరుపతి విద్య, అక్టోబర్ 10, ప్రభాతవార్త:



తిరుపతి గ్రేప్‌కు చెందిన 35(ఎ) బెటాలియన్ 15 మంది శాశ్వత శిక్షకులు(పి.ఐ) మరియు 13 అసోసియేటెడ్ ఎన్‌సిసి ఆఫీసర్లు(ఏఎన్‌ఓలు)తో కలిసి 506 మంది ఎన్‌సిసి క్యాడెట్‌లతో కూడిన ఎపి ట్రెక్ -1 అనే ట్రెక్కింగ్ యాత్రను నిర్వహించింది. శ్రీ వారి మెట్టు మార్గంలో తిరుమలకు పాదయాత్ర ప్రారంభ మైంది. తమ గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత, క్యాడెట్లు ,సిబ్బంది ఆలయంలో లార్డ్ బాలాజీకి ప్రార్థనలు చేశారు.

## వ్యాపార దిగ్గజం రతన్ టాటాకు ఘన నివాళి

### -దేశం దార్శనికుడిని కోల్పోయింది: మదుసూధన్




తిరుపతిరూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

భారతీయ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి మదుసూదన్ ఆవేదన వ్యక్తం చేసారు. రతన్ టాటా చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసిందన్నారు.. జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిందన్నారు. విలువలతో కూడిన వ్యాపారాన్నికి చిరునామాగా నిలిచిన ఓ మహనీయుడిని మన దేశం కోల్పోందన్నారు. తరతరాలకు స్ఫూర్తి నిచ్చే దార్శనికుడిని దేశం కోల్పోయిందన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో శ్రీ యాకారమ్మ

తిరుపతిరూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



శ్రీయాకారమ్మ (ఏకాంబరేశ్వరి) దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి గ్రామంలో వెలసిన శ్రీయా కారమ్మ ఆలయంలో దరస శరన్న నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మెన్ పెద్దమంగారి గౌతమి గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దసర రోజున మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి గ్రామ ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

## నేడు నగరిలో అన్న క్యాంటిన్ ప్రారంభోత్సవం




నగరి, అక్టోబరు 10 ప్రభాతవార్త:

నగరి మున్సిపాలిటీ పరిధి సంత మైదానంలో 'అన్న క్యాంటిన్' భవనాన్ని నేడు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మున్సిపల్‌చైర్మన్, వైస్ చైర్మన్, టీడీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

## పుత్తూరు నూతన ఎంపీడీవోగా రమేష్‌బాబు

పుత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:

పుత్తూరు మండల నూతన ఎంపీడీవోగా రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

# ఏడు కొండలదేవునికి నేడు 'రథోత్సవం'





తిరుమల,అక్టోబర్ 10(ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు కొలువైన తిరుమలలో స్వామివారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపుఘట్టానికి చేరుకున్నాయి. ఎంతో పవిత్రమైన,ప్రాధాన్యత వున్న తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదివరోజు ఉదయం రథోత్సవం జరుగుతుంది. శుక్రవారం ఉదయం ఈ రథోత్సవానికి ప్రాధాన్యత సంతరించుకుంది. సాక్షాత్తు శ్రీనివాసుడే స్వయంగా తిరుమలలో జరిగే కార్యక్రమాలను గమనిస్తారని పురాణాల్లో పేర్కొనబడింది. బ్రహ్మోత్సవాలలో మరో అత్యంత ప్రధానమైన మరోఘట్టం రథోత్సవం కావడంతో ఉభయదేవేరులతో మలయప్ప స్వామిని మహోన్నత రథంపై అధిష్టింపజేస్తారు. ఆలయమాఢవీధులలో భక్తులే గుర్రాలుగా రథాన్ని లాగి భక్తిపార వశ్యులవుతారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, టిటిడి అధికారులు అందరూ సేవకులుగా ముందుకులాగి గోవిందుని సేవలో తరిస్తారు.

**-మహారథానికి 'బంగారుగొడుగు'**

సాలకట్ల బ్రహ్మోత్సవాలలో నేటి ఉదయం జరిగే రథోత్సవానికి పైన బంగారుగొడుగు అలంకరించడం సాంప్రదాయం. ఈ గొడుగునుకల్యాణకట్ట మిరాశీదారులు గురువారం సాయంత్రం అందజేశారు.

## మైమరపించిన బిహు,గురియా.దాండియా నృత్యాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**

కలియుగ వైకుంఠం ఏడుకొండలపై శ్రీవేంకటేశ్వరస్వామివారికి జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు గురువారం ఉదయం సూర్యప్రభ వాహనసేవ ముందు కళాకారులు వివిధ రకరకాల కళారూపాలతో నీరాజనం సమర్పించారు. హిందూ ధర్మప్రచారపరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్యప్రాజెక్టు కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేశంనలు మూలల నుండి వచ్చిన 16 బృందాలు, 405మంది కళాకారులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శించారు. వాహనసేవముందు జియ్యంగార్ల వేదఘోష్టి ఆలపించారు. అస్సాంరాష్ట్రానికి చెందిన జోయ బృందం ప్రదర్శించిన బిహు నృత్యం, పంజాబ్‌కు చెందిన రాహుల్‌హెగడే బృందం ప్రదర్శించిన గురియా నృత్యం, విశాఖపట్నంకు చెందిన విజయ బృందం ప్రదర్శించిన దాండియా నృత్యం మైమరిపింపజేసింది









## బ్రహ్మోత్సవాల్లో నేడు 11.10.2024 "రథోత్సవం"

### ఉదయం 7గంటలకు



తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవరోజు ఉదయం స్వామివారు రథోత్సవంపై ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. ఉభయదేవేరులతో మయలప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్టింపజేసి ఆలయ వీధులలో విహరింపజేస్తారు.

**-"అశ్వవాహనం": రాత్రి 7గంటలకు**



బ్రహ్మోత్సవాల్లో చివరిరోజురాత్రి ఆఖరువాహనంగా అశ్వవాహనం నిర్వహిస్తారు. జంతువులలో మిక్కిలి గల జంతువు అశ్వం. అనాదిగా మానవుడు అశ్వాలను వాహనాలుగా వినియోగించాడు. అశ్వవాహనంపైనే శ్రీనివాసుడి పార్వేట ఉత్సవం జరిగింది.

**-విశేషంగా 'స్నపనతిరుమంజనం':**

తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు గురువారం మధ్యాహ్నం 2గంటలకు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామివారికి విశేష స్నపన తిరుమంజనం జరిగింది. నీరు, చందనం, కొబ్బరిజలం, పాలు, పెరుగు, తేనె,సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ధూపదీపకర్పూర హారతులిచ్చారు.

## ప్రశాంతంగా పవిత్రపుణ్యస్నానాలు...పుష్కరిణి వద్ద ఏర్పాట్లు పూర్తి

తిరుమల,అక్టోబర్ 10ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండలవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరగా పవిత్రంగా రేపు ఉదయం జరిగే చక్రస్నా సమయంలో భక్తులు,అర్చకులు, అధికారులు అందరూ పవిత్ర స్నానం చేస్తారు. లక్షలాదిగా భక్తులు పుణ్యస్నానాలాచరించే అవకాశం ఉన్నందున ఇప్పటికే టిటిడి అధికారులు,పోలీసు యంత్రాంగం పుష్కరిణి వద్ద గట్టి ఏర్పాట్లుచేసింది. భక్తులు రోజంతా పవిత్ర పుణ్యస్నానం ఆచరించేలా అన్ని చర్యలు, ఏర్పాట్లు చేపట్టామని టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యాచౌదరి, సివిఎస్ఓ శ్రీధర్ తెలిపారు.

## దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కోట, అక్టోబర్ 10 ప్రభాతవార్త : కోట మండలం గూడలి గ్రామంలోని రామలింగ చాముండేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంతో దర్శనమిచ్చారు. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని పులకించారు. దుర్గముడెనె రాక్షస సంహారం చేసిన శక్తి స్వరూపం దుర్గాదేవి. కోటి సూర్యప్రభలతో వెలుగొందే ఈ దేవి భక్తులను సర్వ దుర్గతుల నుంచి కాపాడుతుంది. ఈమె మహా ప్రకృతి స్వరూపిణి. ఈ తల్లి ఉపవాసాల ద్వారా ఈతిబాధలు నశిస్తాయి. గ్రహ బాధలు తొలగుతాయి.

## దుర్గామాతగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



సదుం అక్టోబరు10 ప్రభాతవార్త : మండల పరిధిలోని పలు ఆలయాలలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవార్లు దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చారు. సదుంలోని సదుమమ్మ దేవత, జాండ్రపేటలోని శ్రీరామలింగ చౌడేశ్వరీదేవి, రెడ్డివారిపల్లెలోని శ్రీ చామంతుల యల్లమ్మ, పచ్చారుమాకులపల్లెలోని శ్రీ గంగా పురమ్మవార్లకు ఉదయం విశేష అభిషేకాలు చేశారు. అనంతరం దుర్గామాత అలంకరణ నిర్వహించారు. ఈసందర్భంగా సాయంత్రం అమ్మవారి ఆలయాలలో మహిళలు కుంకుమాభిషేకాలు చేశారు. అదేవిధంగా బూరగమందలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## లలితాదేవిగా ఆరిమాని గంగమ్మ



శ్రీరంగరాజపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆరిమానుపల్లి గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం లలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. ఆలయంలో జరిగిన అభిషేకం కార్యక్రమానికి ఉభయదారులుగా బెంగళూరు శివగంగా పురంకు చెందిన చిట్టి, నాగమణి, వేద, జానీ, గోపిలు వ్యవహరించారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి, అప్పిస్వామి బృందం ప్రాతఃకాల అర్చన, హారతి, అభిషేకం, హోమం, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం గంగమ్మగుడికి చెందిన గురువమ్మ, దొరస్వామినాయుడుల కుమారులు ప్రకాష్‌బాబు, ప్రసాదబాబు, ప్రవీణ్‌బాబుల కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని లలితా దేవి అలంకరణతో గ్రామోత్సహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హిమాచరపతిరెడ్డి, జలంధర్‌నాయుడు, వెంకటరమణ, సిద్ధయ్యశెట్టి, మునిరెడ్డి, హేమాద్రియాదవ్, స్థానికులు జగన్నాధనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, దేవవాలయ సిబ్బంది, తయ్యూరు పాయకట్టు 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## వనదుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ దర్శనం

**-ఆకట్టుకున్న అలంకరణలు**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారు శ్రీమహాగౌరిదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వగా, ముత్యాలమ్మ అమ్మవారు వేపచీరతో వనదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గాదేవి అమ్మవారు మహాదుర్గాదేవిగా దర్శనం ఇవ్వగా, కృష్ణారెడ్డి మండపంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. ఇక ముత్యాలమ్మ అమ్మవారు మూలవిరాట్టు అలంకరణ ఆకట్టుకోగా, దక్షిణకాళికా దేవి అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇక పానగల్‌లోని పొన్నాలమ్మ దుర్గాదేవిగా, బిపి అగ్రహారంలో వెలసిన పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మ అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనం ఇవ్వగా, బజారువీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవి దుర్గాపరమేశ్వరి అలంకరణలోను, భాస్కరపేటలోని చాముండేశ్వరి దేవి దుర్గాదేవిగా,భక్తులకు దర్శనం ఇచ్చారు.

## శ్రీ రాజరాజేశ్వరీ అలంకరణలో శ్రీమూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: సత్యప్రమాణాలకు నెలవైకొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు శ్రీ రాజరాజేశ్వరీ అలంకరణలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆలయ అర్చకులు అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలకు విశేష అలంకరణ గావించి శ్రీరాజరాజేశ్వరీ అలంకరణలో సింహ వాహనంపై అధిష్టింపజేశారు. వాహన సేవకు మల్లయ్యపల్లికి చెందిన పసుపుల దేవరాజులు, చంద్రగిరికి చెందిన పార్లపల్లి వంశస్థులు, రెడ్డివారిపల్లి సర్పంచ్ చిన్నకాలప్పగారి రేవతి ప్రకాష్ రెడ్డి, చంద్రగిరికి చెందిన నాగాతం సంగీత సుమన్‌కుమార్, అగరాలకు చెందిన తూకాకుల మునిలక్ష్మి జయచంద్రారెడ్డి (జెసిఆర్), చంద్రగిరి, ఈశ్వరీ ఏజన్సీస్ అధినేత సి.మునిరత్నం రాయల్, రాఘవేంద్ర బేకరీస్ అధినేత బోడిరెడ్డి ఈశ్వర్ రెడ్డి దాతలుగా వ్యవహరించారు. వీరికి ఆలయ ఈఓ కె.మమత దర్శన ఏర్పాట్లు గావించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## రాష్ట్రంలో బిజెపి సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి మూడో స్థానం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త : ఆంధ్ర రాష్ట్రంలో బిజెపి చేపట్టిన సభ్యత్వ నమోదులో 2019కి అధిగమించి ఈ ఏడాది రాష్ట్రంలోనే మూడవ స్థానంలో శ్రీకాళహస్తి నిలవటం అభినందనీయం అని కేరళ మాజీ అధ్యక్షుడు పికె కృష్ణదాసు అన్నారు. గురువారం పట్టణంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాలను యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఆర్,హరీష్‌రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసారు. అసెంబ్లీకన్వీనర్, రాష్ట్రకార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో చేపట్టిన సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే శ్రీకాళహస్తిని నెంబర్ వన్ చేయాలన్నది తన లక్ష్యమని కోలా ఆనంద్‌కుమార్ కార్యకర్తలకు వివరించారు.నేడు భారత దేశాన్ని విజయపథంలో నడుపుతూ ప్రపంచ దేశాల దృష్టిని ఆకట్టుకుంటుందన్నారు.నరేంద్రమోదీ నిరుపేదల సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వటంతో ప్రజలను ఆకట్టుకుంటున్నారన్నారు. పరిశీలకులుగా వచ్చిన కేరళ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పికె కృష్ణదాసు మాట్లాడుతూ ఇప్పటి వరకు అందిన సమాచారాన్ని బట్టి ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న సభ్యత్వ నమోదులో కోలా ఆనంద్ సారథ్యంలో నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి సభ్యత్వ నమోదు మూడవ స్థానంలో ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లోజిల్లా అధ్యక్షులు సిపి చంద్రప్ప, జిల్లా కార్యదర్శి పుణ్యం ఢిల్లికుమార్‌రెడ్డి, పెదపాళెం రవి ఆచారి, జ్ఞానగారి పోలయ్య, పట్టణ యువమోర్చా తానికొండ్ల భరత్,తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల కిస్తీ 6 కంతుల్లో కట్టవచ్చు

**ఒకరు ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు**

**ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, డిప్యూటీ కమిషనర్ తలమల విజయశేఖర్**



నగరి, అక్టోబరు 10 ప్రభాతవార్త: లాటరీ పద్ధతిలో కేటాయించే షాపులకు కట్టాల్సిన లైసెన్సు ఫీజులు(కిస్తీ) ఆరు కంతుల్లో కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ తలమల విజయశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ కార్యాలయానికి విచ్చేసిన ఆయన సిబ్బందికి మద్యం దుకాణాల సంబంధించి విధి విధానాలు తెలియపరచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరి ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో నగరి,నింద్ర, విజయపురం మండలాలకు చెందిన 11 షాపులకు గాను 160 దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి సమయాన్ని రెండు రోజులు పొడిగించడం జరిగిందన్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 14వ తేదీ చిత్తూరు-కాణిపాకం రోడ్డులో సంతపేట ఓబునపల్లి ఆర్‌ఆర్ గార్డెన్స్ మాణిక్యమ్మ ఫంక్షన్ హాలులో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ జరుగుతుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ బి.సుబ్రహ్మణ్యం, సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## అన్నదాత దేశానికి వెన్నుముక లాంటివారు



వెంకటగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త : జీవనానికి అవసరమైన ఆహారం అందించే రైతుల సేవ కంటే మించిన సేవ సృష్టిలో ఇంకేమి లేదని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. వెంకటగిరి సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపిఈఓల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆహారముతోనే జగతిలో జీవము ఉన్నదని దీనిని రైతులు ఉత్పత్తి చేస్తున్నారని ఆయన తెలిపారు. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న ఆరోక్తి వచ్చింది. అందుకే రైతుల సేవ దైవ కార్యాలకంటే గొప్పదని వివరించారు. జిల్లా వనరుల కేంద్ర ఏఓ వేణుగోపాల్ రావు వరిలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వెంకటగిరి సబ్ డివిజన్ ఏడిఏ నాగార్జున సాగర్ రాబోయే రబీ సీజన్‌లో చేపట్టవల్సిన ముందస్తు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం గురించి ప్రకృతి వ్యవసాయ ఎన్ఎస్ఏ ఉదయ్ కిరణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో డక్కిలి ఏవో విజయ భారతి, వెంకటగిరి ఏవో సుజాత, టెక్నికల్ వరప్రసాద్ పాల్గొన్నారు.

## పల్లె పండుగను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త : పార్టీలకు అతీతంగా అధికారులు, నాయకులు సమన్వయంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పల్లె పండుగలు వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14 నుండి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద మండలంకు 2 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ నిధులతో మండలంలో ఎస్‌టి, ఎస్సి, బిసి కాలనీలలో సిసి రోడ్లు, కాలువలు, కాంపౌండ్ వాల్‌లు నిర్మిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు ఈ ప్రభుత్వం ముందుంటుందన్నారు. కర్ణాల వీధిలోని ఉదయగిరి గురు లీలా అనే వికలాంగురాలకు ట్రై సైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, వి. వెంకటేశ్వర్లు రెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు, పులిమి శ్రీనివాసులు నియోజకవర్గంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 40రోజులలో టిడ్కో ఇళ్లపై శ్వేతపత్రం : టిడ్కో చైర్మెన్



పుంగనూరు, అక్టోబరు10 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల స్థితి గతులపై 40 రోజులలో శ్వేత పత్రం విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు టిడ్కో చైర్మెన్ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఉమ్మడి జిల్లాల జనసేన అద్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి పుంగనూరులో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన చదళ్లలో ప్రముఖ దాత,నిర్మాణం వేత్త ఎన్ గోపాల్‌రెడ్డిని కలిశారు. అక్కడ శ్రీసప్తమాతృక సమేత శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకులతో మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద ఏ ఒక్కటో రెండో చోట్ల తప్పటిడ్కో ఇండ్లు సముదాయాలు తీవ్ర అసౌకర్యాల మధ్య అభద్రతల మధ్య చాలీ చాలని ఏర్పాట్లుతో ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించనున్నామన్నారు. ఇప్పటికే పీఠాపురం, నెల్లూరులో పర్యటించామని చెప్పారు. అసౌకర్యాల మధ్య ఉన్న లబ్ధిదారులు బ్యాంకులకు ఈఎంఐలు చెల్లిస్తున్నప్పటికి వారికి ఇంకా ఇండ్లను ఇవ్వలేదని పలు చోట్ల అసలు లబ్ధిదారులకే ప్రత్యామ్నాయంగా ఇంకొకరిని నియమించే దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇళ్లన్నింటిని పరిశీలించిన తర్వాత వాటి పరిస్థితులపై స్పందిస్తామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు తెలిపి వెంటనే అర్హులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా తగిన రక్షణ కల్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. తితిదే బోర్డు మాజీ సభ్యుడు ఉమ్మడి జిల్లాలజనసేన అద్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సమాజం ఉన్నతస్తితికి ఎదుగుతుందని వేణుగోపాల్‌రెడ్డి లాంటి ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులు ప్రజాసేవ కోసం ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలిసన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా వీరిని ట్రస్టు చైర్మెన్ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి శివకుమార్‌రెడ్డిలు సభ్యులు ఘనంగా సన్మానించారు. వీరి వెంట జిల్లా జనసేన కార్యదర్శి పగడాల రమణ, నియోజక వర్గ నాయకుడు విరూపాక్షి సురేష్‌లు పాల్గొన్నారు.

## పాలమాకులపల్లిలో చోరీ



బంగారుపాళ్యం, అక్టోబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని పాలమాకులపల్లి జాతీయ రహదారి సమీపంలోని ఓ నివాస గృహంలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. 60 వేల రూపాయల నగదు, 17 సవరాల బంగారు నగలను దుండగులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన జి.ప్రమీళ రహదారికి ప్రక్కన ఒంటరిగా నివాసం ఏర్పరచుకుని జీవిస్తోంది. ఇంటికి తాళాలు వేసుకుని ఉదయం 9.30 గంటల సమయంలో పశువుల మేత కోసం సమీప పొలాలకు వెళ్ళింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి మెయిన్ గేటు తాళాలు పగులగొట్టి తలుపులు నిగ్గదీసి ఇంటిలోకి ప్రవేశించి కబోర్డులో వున్న 60 వేల రూపాయల నగదు, 17 సవరాల బంగారు నగలు దోచుకెళ్ళారు. తిరిగి మధ్యాహ్నం భోజనం చేయడానికి ప్రమీళ ఇంటికి రావడంతో దొంగతనం జరిగిన విషయంను గుర్తించి గ్రామస్తులకు తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అనంతరం చిత్తూరు నుండి వేలి ముద్రల నిపుణులు వచ్చి సంఘటనా స్థలంలో వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటు



పుత్తూరు, అక్టోబరు 10 ప్రభాతవార్త : పారిశ్రామికవేత్త రతన్ టాటా ఆకస్మిక మృతి దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. గురువారం ఎంబిరోడ్డులోని తన కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వ్యాపారమే కాకుండా ఆధ్యాత్మిక, సేవా రంగాలకు సంబంధించిన ఆయన చేసిన సేవ, వేల కోట్ల దానం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇ.రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.ధనపాల్, నాయకులు దాసరి విజయ్‌చౌదరి, సెంగనాథన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పవిత్రతను కాపాడటానికి ప్రతి ఒక్కరు సహకరించాలి!

**అర్చకులు,వేదపండితుల సమావేశంలో ఇఓ ఆజాద్**



శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ పవిత్రతను కాపాడటానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ కోరారు. గురువారం ఆలయ పరిపాలనా భవనాల్లోని ఇఓ ఛాంబర్‌లో వేదపండితులు,అర్చకులతో ప్రత్యేక సమావేశం జరిపారు.ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం పంచ భూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం అన్నారు. ఇక్కడకు ఎంతో భక్తి శ్రద్దలతో ప్రపంచ దేశాల నుంచి భక్తులు వస్తున్నారని వారి మనోభావాలకు అనుగుణంగా మనం వ్యవహరించాలన్నారు. వేదపండితులు వేదమంత్రాల ఉచ్చారణలతో జీవం పోయాలన్నారు. మంత్రానికి ఎంతో శక్తి ఉందన్నారు.ఈ సందర్భంగా యూనియన్‌కు చెందిన నాయకులు శివప్రసాద్‌శర్మ, మారుతీ శర్మలు మాట్లాడుతూ తమకు అప్పగించిన విధులను నిర్వర్తిస్తున్నామన్నారు. వేదపండితులు అవసరమైన చోట డెప్యూటీ ఇవో అనుమతితో సహకరించాలన్నారు. సమావేశంలో కొందరు తాము రాహుకేతుదోష నివారణ పూజలు జరిపినపుడు ఎవ్వరి వద్ద డిమాండ్ చేయటం లేదన్నారు. ఎవరైనా భక్తులు పాప పరిహారం కోసం వచ్చి ఏదైనా సంభావన ఇస్తేతీసుకుంటాము కానీ తాము ఎక్కడా బలవంతంగా వసూళ్ళు చేయమన్నారు.అర్చకులు, వేదపండితులు డెప్యూటీ ఆదేశాల మేరకు ఎక్కడ అవసరమైతే సహకరించాలన్నారు.

## నా పేరు చెప్పుకొని బెదిరిస్తే...పోలీసులకు ఫిర్యాదు చేయండి!

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



గంగవరం, అక్టోబర్ 10 ప్రభాతవార్త : తన పేరు చెప్పుకొని ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మాజీ మంత్రి,పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. తన పేరు చెప్పుకుని డబ్బుల కోసం బెదిరిస్తూ చట్టవిరుద్ద కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి.. మండలంలోని గంగవరం పంచాయతీ డ్రైవర్స్ కాలనీకి చెందిన రవి అనే వ్యక్తి అతని అనుచరులతో కలిసి గత వారం రోజులుగా డ్రైవర్స్ కాలనీకి చెందిన దాదాపు 60 మందికి సంబంధించి పేదలు నిర్మించుకున్న పునాదులను జెసిబితో కూల్చివేశారు.దీనిపై ఈ నెల 8న బాధితులు న్యాయం కోసం స్థానిక పోలీసులకు,రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో తమపైనే అధికారులకు ఫిర్యాదు చేస్తారా అంటూ ఆగ్రహించిన రవి అనుచరుడు శివ అనే వ్యక్తి బాధితులైన సునంద,శాతాజ్,మణిలపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.గాయపడ్డ బాధితులను స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం ఉదయం డ్రైవర్స్ కాలనీని సందర్శించి పేదల పునాదులను లోడేసిన స్థలాలను పరిశీలించి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రౌడీయిజం చేసినా,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని తాను ఎప్పటికీ ప్రోత్సహించనని పేర్కొన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి హెల్త్, అక్టోబర్ 10 ప్రభాతవార్త : శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి సందర్భంగా ఆలయంలో గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఏడు గంటల నుండి 8 గంటలకు అమ్మవారి అభిషేకంతో మొదలై దేవి హోమం, 10 గంటలకు సహస్ర నామఅర్చన నిర్వహించారు. అలాగే పూజలో పాల్గొన్న ఉభయదారులకు అమ్మవారి ప్రసాదం అందచేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్, ఆలయ అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి తెలిపారు.

## శెట్టిపల్లి భూముల సమస్యల పరిష్కారానికి

**వెంటనే భూ సర్వే పనులు పూర్తి చేయాలి-జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్లు**



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త : శెట్టిపల్లి భూముల సమస్యల పరిష్కారానికి వెంటనే భూ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం జాయింట్ శుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, రెవెన్యూ అధికారులు, నగర పాలక సంస్థ, ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు, శెట్టిపల్లి సాధన సమితి ప్రతినిధులతో కలిసి శెట్టిపల్లి పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శెట్టి పల్లి భూములు సమస్యల పరిష్కార కోసం రెవెన్యూ, ల్యాండ్, సర్వే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయ చేసుకొని భూములను సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మట్టిని తీసుకెళ్తున్నారని, అడ్డు చెప్పడంతో మా పై దైర్జన్యం చేస్తున్నారని అక్కడ ఉన్న ప్రజలు కలెక్టర్‌కు చెప్పగా, కలెక్టర్ జేసి, కమిషనర్ మట్టి తవ్వకాల ప్రాంతాలను పరిశీలించి, ఇకపై ఎవ్వరైనా మట్టిని తరలించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ల్యాండ్ అక్విటీన్స్ అధికారిణి సుజన, ఈఈ రవీంద్రయ్య, టిపిఓ దేవికుమారి, ఆర్‌డిఓ డిప్యూటీ కలెక్టర్, రామ్ మోహన్, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, డిటి అశోక్, విఆర్‌ఓలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.